29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

న్యాల్‌కల్, జనవరి 20: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని మండల విద్యాధికారి మారుతీరాథోడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 1నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 65 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. ఈనెల 22న తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న పోటీలో ఉన్నవారి తుది జాబితా, 29న ఆయా పాఠశాలల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేతులు ఎత్తే విధానంలో ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం 2 గంటల నుంచి 4గంటల వరకు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహించి, పాఠశాలల్లో సమస్యలను చర్చిస్తామన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

మనస్సు నియంత్రణతోనే విజయం

సదాశివపేట, జనవరి 20: మనస్సు నియంత్రణతోనే జీవితంలో విజయం సాధిస్తామని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ గజేంద్రనాథ్ చౌదరి అన్నారు. శనివారం ఉజ్వల కళాశాల విద్యార్థులకు 'పీస్ ఆఫ్ మైండ్ గోల్డ్ సెట్టింగ్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. విద్యార్థులు ఎప్పుడూ ఒకరితో మనరొకరిని పోల్చుకోకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్, డైరెక్టర్లు రఘువర్ధన్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నీలకంఠం, కరస్పాండెంట్ పోల వెంకటేశం, లెక్చరర్లు చంద్రశేఖర్, గం గయ్య, సునీత, వరలక్ష్మి, ప్రియాంక, రాజు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ గజేంద్రనాథ్ చౌదరి

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

కోహీర్, జనవరి 20: బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం కోహీర్ పట్టణంలో బీజేపీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం కవేలి గిరిజా సమేత మహాలింగ సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన గోదావరీఅంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వైద్యనాథ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కిష్టయ్య, ఆంజనేయులు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోహీర్‌లో బీజేపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న జహీరాబాద్ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి

లింగ వివక్షతను రూపుమాపాలి

సంగారెడ్డి, జనవరి 20 : లింగ వివక్షతను మహిళలు అధిగమించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి మండలంలోని ఫసల్‌వాది, కులబ్‌గూర్ గ్రామాల్లో జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీబచావో బేటీబడావో కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ సమాజంలో నేటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. మహిళలకు అండగా చట్టాలు, హెల్ప్‌లైన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధ్యాయులు షహనాజ్ ఫాతిమా, ప్రధానోపాధ్యాయురాలు వహీద్ పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలిక దినోత్సవ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచులు, అధికారులు, మహిళలు

రామచంద్రపురంలో ఉచిత క్యాంప్

రామచంద్రపురం, జనవరి 20: భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్స్ సొసైటీ కాలనీలో కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంచర్ అండ్ నేచురోపతి విద్యాసంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత క్యాంపును కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలసట, ఒత్తిడి, నిద్రలేమి, కీళ్ల నొప్పులు, వెన్ను నొప్పి, తలనొప్పి వంటి అనేక రకాల అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందేందుకు నిపుణులు అందించే సలహాలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిపుణులు మంజుల, సత్య, స్పందన, బిందు, రామచంద్రం, రవీంద్ర, దుర్గాబాయి పాల్గొన్నారు.

ఉచిత క్యాంపును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

హత్నూర, జనవరి 20: హత్నూరలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మా పిల్లలను చదివిస్తే కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని ఆరోపించారు. పలుమార్లు సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. నూతన పాఠశాల భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, నిలిచిపోయిన పాఠశాల భవనం పనులు పూర్తిచేయాలని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు వసీంఅలీ, కృష్ణ, మల్లేశం, దుర్గేశ్, చక్రపాణి, జనార్దన్, లింగం, జమీల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

పుల్కల్, జనవరి 20: ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిహెప్పిబా కోరారు. శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బస్వాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సరైన సమయంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రిన్సిపాల్ చెప్పారు. గతంలో మా పాఠశాలకు ప్రత్యేక బస్సు ఉండేదన్నారు.

ఇప్పుడు ఆ బస్సును తీసివేయడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలకు రాలేక అవస్థలు పడుతున్నారన్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సును మళ్లీ ప్రారంభించాలని ప్రిన్సిపాల్ జ్యోతిహెప్పిబా కోరారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- సొంత నిధులతో 33మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

రామచంద్రాపురం, జనవరి 20: పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని మహిళల ఆర్థికాభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు వడ్డెర సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సొంత డబ్బులతో కొనుగోలు చేసిన 33 కుట్టు మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ లలితాసోమిరెడ్డి సొంత డబ్బులతో కొనుగోలు చేసిన 3ఆటోలను యువకులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళల సంక్షేమం కోసం హామీలు గుప్పించి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుకు సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితాసోమిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్ శ్రీశైలం, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపాల్, చెన్నారెడ్డి, వడ్డెర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే హ్యాట్రిక్ విజయం

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమష్టి కృషితోనే పటాన్‌చెరు నియోజకవర్గంలో గులాబీ జెండా మూడోసారి రెపరెపలాడిందని ఎమ్మెల్యే అన్నారు. మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా తెల్లాపూర్ మున్సిపాలిటీలోని ఉస్మాన్‌నగర్ వార్డు సభ్యుడు చిట్టి ఉమేశ్ స్థానిక హనుమాన్ ఆలయం నుంచి చిలుకూరు బాలాజీ ఆలయం వరకు చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జహీరాబాద్, జనవరి 20: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సూర్యకృష్ణ తెలిపారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహన చట్టం, మహిళా చట్టం, నిర్భయ చట్టం, సమాచార చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు గోపాల్, రుద్రయ్యస్వామి, బుజ్జమ్మ, శ్రీనివాస్‌ఖన్న, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, దత్తు, విజయలక్ష్మి, నర్సింహులు, రమేశ్, లావణ్య, నిఖిత, దీపిక, శ్వేత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేయాలి

జహీరాబాద్, జనవరి 20: వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి యాసంగి పంటలను సర్వే నంబర్ల వారీగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. శనివారం జహీరాబాద్ మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామంలో చెరుకు పంటను, పట్టణంలోని ఎరువుల షాపులను పరిశీలించారు. ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తుందని, పంటల సాగును పక్కగా నమోదు చేయాలన్నారు. ఎరువులు, రసాయన మందులు, విత్తనాల క్రయవిక్రయాల వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏవో ప్రవీణ, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, రైతులు పాండుయాదవ్, పాండు, దత్తాత్రేయ పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్ల తనిఖీ

కంది, జనవరి 20: కంది మండల పరిధిలోని ఎర్రనూర్ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లను శనివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేశారు. అక్కడ వేసిన గుడిసెలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. గతంలో ఇసుక ఫిల్టర్లను కూల్చివేసినప్పటికీ నిర్వాహకులు మళ్లీ కొనసాగిస్తూ అక్రమ దందా చేస్తున్నారన్నారు. అధికారుల హెచ్చరికలను సైతం బేఖాతరు చేస్తూ నింబధనలకు విరుద్ధంగా కృత్రిమంగా ఇసుకను తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కృత్రిమ ఇసుక తయారీ కోసం తీసిన గుంతలు పెద్దబావులుగా దర్శనమిస్తూ ప్రమాదకరంగా మారాయన్నారు. ఇసుక ఫిల్టర్లను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయలక్ష్మి హెచ్చరించారు. తనిఖీల్లో రూరల్ సీఐ సురేందర్‌కుమార్, ఆర్ఐ వెంకట్రామ్ రెడ్డి, పోలీస్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్లను పరిశీలిస్తున్న అధికారులు

గణిత ప్రతిభ పరీక్ష

కల్హేర్, జనవరి 20: తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో మండల పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్షను నిర్వహించినట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజాకులకర్ణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని కల్హేర్, మాసాన్‌పల్లి, మార్డి, బీబీపేట్ పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారని చెప్పారు. పరీక్షలో మాసాన్‌పల్లికి చెంది న శ్రీవాణి, మార్డికి చెందిన భవాజ్ఞ, వర్ష ప్రతిభ కనబర్చరన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయికోడ్, జనవరి 20: పేకాట ఆడుతున్న 12మందిని అరెస్ట్ చేశామని రాయికోడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని కుస్నూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో దాడి చేశామన్నారు. 12 మంది పేకట ఆడుతుండగా అరెస్ట్ చేయడంతోపాటు రూ. 19,900ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, జనవరి 20 : హత్నూర మండలం సిరిపుర గ్రామానికి చెందిన పలువురిని శనివారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డి, ఫయూలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారిని పరామర్శించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మీనరేందర్, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


సిరిపురలో బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సీపీఐ ఎప్పుడూ పేదల పక్షమే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

జహీరాబాద్, జనవరి 20 : సీపీఐ ఎప్పుడూ పేదల పక్షమే ఉంటుందని, పేదల సమస్యలపై పోరాటాలు చేస్తుందని, నిరుపేదలకు ఇండ్ల స్థలాల పంపిణీకి కృషి చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని తమ్మడ్‌పల్లిలో సంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

నైజాం పాలనలో సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. భూస్వాములపై పోరాటం చేసి పేదలకు భూములు పంచామమని చెప్పారు. అధికారం ఉన్నా, లేకపోయినా పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని క్యాడర్‌కు కూనంనేని పిలుపునిచ్చారు. బీజేపీకి అనుకూలంగా ఎంఐఎం పని చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఈటీ నర్సింహ ఆరోపించారు. జహీరాబాద్‌లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు పోరాటం చేస్తామన్నారు. భూ ముల్లో గూడిసెలు వేసి పేదలకు పంపిణీ చేస్తామని భరోసా నిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాశ్‌రావు, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల కార్యదర్శులు మంద పవన్, జలాలొద్దీన్, జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింహులు , జాతోద్దీన్, బాల్‌రెడ్డి, లక్ష్మి, రుబేన్ బేగం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు చర్యలు

పటాన్‌చెరు : గీతం యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు, జనవరి 20: గీతం యూనివర్సిటీని కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూంల ఏర్పాటు కోసం ఎస్పీ రూపేశ్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ హాల్స్‌ను అధికారులతో కలిసి చూశారు. ఈ సందర్భంగా గీతం విద్యాసంస్థ ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోసం స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేసేందుకు అధికారులు పరిశీలించారు. త్వరలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ రెవెన్యూ డివిజన్ అధికారులు, పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన

సంగారెడ్డి, జనవరి 20: పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని(7) అసెంబ్లీలకు అవసరమైన స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓట్ల లెక్కింపునకు సంబంధించిన శాసనసభ స్థానాల వారీగా స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాట్లను తనిఖీ చేశామన్నారు. వారివెంటా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్‌గౌడ్, డీఎస్పీ, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, పటాన్‌చెరు తహసీల్దార్ ఉన్నారు.

ఓటరు లిస్టుపై విచారణ జరపాలి

జిన్నారం, జనవరి 20 : మాదారం పంచాయతీలో నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాల వారు స్థానికంగా ఎలాంటి గుర్తింపుకార్డులు లేకుండానే అక్రమంగా ఓటు హక్కు నమోదు చేయించుకున్నారని, వాటిపై పూర్తిగా విచారించి అక్రమ ఓట్లను తొలిగించాలని మాదారం గ్రామస్తులు రెవెన్యూ అధికారులను కోరారు.

ఈమేరకు శనివారం ఉప తహసీల్దార్ మల్లికార్జునస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో 57, 58 బూత్‌ల్లో ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు లేకుండానే ఓటు హక్కును నమోదు చేసుకున్నారని, సొంత రాష్ట్రాల్లో ఓటుహక్కును వినియోగించుకుంటున్న వారు ఇక్కడ కూడా ఎన్నికల సమయంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు గ్రామంలో విచారణ జరిపి సరైన ధృవపత్రాలు లేకుండా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారి ఓట్లను తొలిగించాలని కోరారు. కార్యక్రమంలో రాజుగౌడ్, సత్యం, రాజేందర్‌సింగ్, నర్సింహ, రాజు తదిత రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జోగిపేట మైనార్టీ బాలుర పాఠశాలలో మాట్లాడుతున్న జడ్జి ధనలక్ష్మి

అందోల్, జనవరి 20: ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలని జోగిపేట కోర్టు జడ్జి ధనలక్ష్మి అన్నారు. శనివారం జోగిపేటలోని మైనార్టీ బాలుర పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో మార్పునకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో గ్రామసభ

గుమ్మడిదల, జనవరి 20 : గుమ్మడిదలలో శనివారం సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జీపీ కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేయవల్సిన పనులపై పలు తీర్మానాలు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కోహీర్, జనవరి 20: కోహీర్ పట్టణానికి చెందిన మహ్మద్ అఫ్రోజ్(26) గతనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని ఎస్సై విఠల్ తెలిపారు. కోహీర్‌లోని మౌలానా మోహీజుద్దీన్ తుర్కి దర్గా వద్దకు వెళ్లిన అఫ్రోజ్ ఇంతవరకు రాలేదన్నారు. అతడి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదన్నారు. అతడిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే కోహీర్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

టీపీజేఎంప అధ్యక్షుడిగా దుర్గేశ్వర్‌రెడ్డి

హత్నూర, జనవరి 20: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా హత్నూర గ్రామానికి చెందిన దుర్గేశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి నర్సింహారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సత్యనారాయణ, కోశాధికారిగా శర్మ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌చౌదరి, మధుసూదర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దుర్గేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రవేట్ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పంచాయతీ కోసం వినతి

జిన్నారం, జనవరి 20: అల్లీనగర్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సర్పంచ్ ప్రకాశ్‌చారికి శనివారం వినతిపత్రం అందజేశారు. గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్ గ్రామాలను కలిసి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సర్పంచ్‌కు మరో వినతిపత్రాన్ని అందజేశారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం తమ వినతులను పరిగణలోకి తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరారు.

ఖాజీపల్లిలో క్లస్టర్ సమావేశం

జిన్నారం, జనవరి 20: ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో శనివారం సీఐటీయూ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ అవలంబిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె, గ్రామీణబంద్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు దీనిని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తయ్య, ప్రభు, నరసింహగౌడ్, నరేశ్, రామకృష్ణ, యూసఫ్ పాల్గొన్నారు.

ఖాజీపల్లిలో క్రషర్ల పరిశీలన

జిన్నారం, జనవరి 20: ఖాజీపల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 144లోని కంకర క్రషర్లను మైనింగ్, రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. మైనింగ్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో కలిసి తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, సర్వేయర్ రామభద్ర మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. సాధారణ పరిశీలనలో భాగంగానే ఖాజీపల్లి పరిధిలోని సర్వేనంబర్ 144లో క్రషర్లను పరిశీలించినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఖాజీపల్లి పరిధిలో 231.7 ఎకరాల పరిధిలో మైనింగ్ ఉందని, 144 సర్వేనంబర్‌లో ఇప్పటివరకు 20 క్రషర్లకు అనుమతులు ఉన్నాయని, 34 హెక్టార్లు మైనింగ్ కోసం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కేటాయింపు వరకే పోజిషన్‌లో ఉన్నాయా లేదా అనే విషయంపై పరిశీలించినట్లు వారు తెలిపారు.

బహిరంగ ప్రకటన

తేది: 21-01-2024

ఇందుమ